ప్రజాశక్తి
గురువారం 4 జనవరి 2024
5
శ్రీ సత్యసాయి





పోలీసుల వలయాన్ని ఛేదించి పుట్టపర్తి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు



పుట్టపర్తి గణేష్ సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



గర్జన

పోరు ముగింట అంగన్‌వాడీలు పిడికిలి బిగించారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా మొద్దునిద్రను ప్రదర్శిస్తున్న ప్రభుత్వంపై నిరసన జ్వాలను తీవ్రతరం చేశారు. బెదిరింపులు, నిర్బంధాలకు ఐక్య పోరాటంతోనే సమాధానం చెప్పారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న అంగన్‌వాడీలను విధుల్లో చేరాలంటూ ప్రభుత్వం ఛార్జిమెమోల ద్వారా బెదిరించడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల తీరును వ్యతిరేకిస్తూ పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట బుధవారం నాడు 4 గంటల పాటు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అంతకుముందు గణేష్ సర్కిల్ నుంచి వేలాదిగా అంగన్‌వాడీలు ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే రెండు గంటల పాటు బైటాయించారు. అనంతరం పోలీసుల వలయాన్ని ఛేదించుకుని కలెక్టరేట్‌కు చేరుకున్నారు. గణేష్ సర్కిల్ నుంచి వేలాది మంది అంగన్‌వాడీలు ఎర్రజెండాలు, ఎర్రటి దుస్తులతో ర్యాలీ చేపట్టారు. దీంతో పుట్టపర్తి వీధులు ఎరుపెక్కాయి.

- కదం తొక్కిన అంగన్వాడీలు
- కలెక్టరేట్‌కు వెళ్లకుండా పోలీసుల అడ్డగింత
- పోలీసుల వలయాన్ని ఛేదించిన అంగన్‌వాడీలు
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, బైటాయింపు
- సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు
- ప్రభుత్వం స్పందించే వరకూ పోరాటం ఆగదు..



పుట్టపర్తికి వెళ్లనీయకుండా అరెస్టు చేయడంతో మడకశిర పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్, రూరల్

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు కదంతొక్కారు. ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఆందోళనను ఉధృతం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు తెలంగాణా ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు పెంపుదల చేయాలని, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా నలమూలల నుంచి వేలాదిగా వచ్చిన అంగన్‌వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. వీరికి సిపిఎం, సిఐటియుతో పలు కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కలెక్టరేట్ వద్ద సిఐటియు జెండాలు చేతపట్టుకుని అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు గణేష్ సర్కిల్లో బైఠాయించి నిరసన తెలిపారు. కలెక్టరేట్ వరకు వెళ్లి తమ సమస్యలను విన్నవించుకుంటామని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పోలీసులకు చెప్పారు. వారు వినకపోవడంతో అంగన్వాడీలు పోలీసుల వలయాన్ని ఛేదించారు. పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు ఉండడంతో పోలీసులు ఏమి చేయలేక వారిని కలెక్టరేట్ వద్దకు పంపారు. కలెక్టరేట్ వద్ద ప్రధాన రహదారిపై బైటాయించి అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన కొనసాగుతుండగా కలెక్టర్ తరపున డిఆర్‌ఒ కొండయ్య వచ్చి అంగన్‌వాడీలతో మాట్లాడారు. అర్జీ ఇస్తే సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. అర్జీలను చాలాసార్లు ఇచ్చామని, తమ సమస్యలు, డిమాండ్లు ప్రభుత్వానికి తెలుసునన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని చెప్పడంతో డిఆర్‌ఒ వెనుదిరిగి వెళ్లిపోయారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించి, అనంతరం ముగించారు.

ప్రభుత్వ బెదిరింపులకు బెదరం..

కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంతియాజ్, శ్రామిక మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి దిల్షాద్‌బి, అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి మాట్లాడారు. అంగన్వాడీలు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని ముఖ్యమంత్రి జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని చెప్పారు. తెలంగాణా రాష్ట్రం కన్నా ఎక్కువ వేతనం ఇస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఎందుకు హామీలను అమలు చేయలేకపోతున్నారని నిలదీశారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగన్వాడీల ఉద్యమాన్ని అణిచివేయడానికి హైదరాబాదులో గుర్రాలతో తొక్కించాడని, తరువాత ఆయన ప్రభుత్వం కూలిపోయిన విషయాన్ని జగన్మోహన్‌రెడ్డి గుర్తించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి సమస్యలను పరిష్కరించకుంటే ఆయన బటన్ నొక్కినట్లు అంగన్‌వాడీల కూడా ఓటు బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపుతారన్నారు. 23 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం అన్నారు.

నోటీసులు ఇస్తే భయపడం..

ప్రభుత్వ అధికారుల ద్వారా మెమోలు, పోలీసుల ద్వారా నిర్బంధాలను ప్రయోగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.. ఇలాంటి బెదిరింపులకు బెదిరేది లేదని అంగన్వాడీల యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి తెలిపారు. 5వ తేదీ లోపు విధుల్లోకి రాకుంటే తగిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించడం సిగ్గుచేటు అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడమని సిఐటియు ఎర్ర జెండా నీడలో పోరాటం మరింత ఉధృతం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి వీడి, సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించాలి. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి. అంగన్వాడీల పోరాటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర రెడ్డి, నాయకులు శివ, సుధాకర్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, బడా సుబ్బిరెడ్డి, జెడ్పీ శ్రీనివాసులు, జంగాలపల్లి పెద్దన్న, కదిరప్ప, జిఎల్.నరసింహులు, ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగార్జునతో పాటు జిల్లాలోని అన్ని మండలాల నుంచి వేలాదిగా అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రవీణ్‌పై అక్రమ కేసు దుర్మార్గం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఇంతియాజ్

ప్రజాశక్తి:- చిలమత్తూరు

వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, మరో 5 మందిపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం దారుణం అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్ తెలిపారు. ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరన్నారు. అంగన్వాడీలు, దళిత మహిళపై ఉద్దేశపూర్వకంగా దుర్భాషలాడిన సచివాలయ ఉద్యోగిపై ముందస్తుగా ఫిర్యాదు చేసినా స్పందించని చిలమత్తూరు ఎస్ఐ గంగాధర్ ప్రవీణ్‌కుమార్‌పై తప్పుడు ఫిర్యాదు చేస్తే మాత్రం వెంటనే కేసు నమోదు చేశారన్నారు. ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషిస్తున్నందనే ప్రవీణ్‌పై అక్రమ కేసు బనాయించి రిమాండ్‌కు పంపారన్నారు. ఎస్ఐ గంగాధర్ ఏకపక్షంగా వ్యవహరించి అక్రమ కేసులు పెట్టారన్నారు. అక్రమ కేసును నిరసిస్తూ గురువారం నాడు డీఎస్పీ కార్యాలయం ముందు అంగన్వాడీలు సిఐటియు నాయకులతో కలిపి పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలి : యుటిఎఫ్



ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఉద్యోగులు ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట యుటిఎఫ్ 12 గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లించి, మెరుగైన పిఆర్సి ఇస్తానని, క్రమం తప్పకుండా డిఎలు ఇస్తానని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేస్తానని ప్రగల్భాలు పలికారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా, ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా వేతనాలు కూడా సరిగా ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులు దాచుకున్న వేల కోట్ల రూపాయలను ఈ ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్లించుకుందని విమర్శించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బాకీలను వెంటనే విడుదల చేయాలని ఇప్పటికే ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాని కారణంగా ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికి ప్రభుత్వ స్పందించకపోతే జనవరి 9 ,10, తేదీలలో విజయవాడలో 36 గంటల పాటు ధర్నాని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు సమగ్ర శిక్ష జెఎసి నాయకులు ఓబిరెడ్డి, రామన్న, సిఐటియు నాయకులు జిఎల్ నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, విద్యార్థి సంఘ నాయకులు సాకే హరి తదితరులు మద్దతు పలికారు. ఈ ధర్నా కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జిహెచ్ బాబు, శ్రీనివాసులు, మారుతి శ్రీనివాసులు, శివ శంకర్, హరికృష్ణ, జి సి నరేష్, వైవి సుబ్బారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర్ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరు

మడకశిర : బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపైకలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించు ధర్నాకు హాజరుకాకుండా మంగళవారం రాత్రి 11 గంటలకు పోలీసులు భూతన్నకు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో భూతన్న మాట్లాడుతూ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగుల ముఖంలో చిరునవ్వు కనిపిస్తుందో అప్పుడు ఆ ఉద్యోగి రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారని అన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బందులు పెడుతోందన్నారు. అక్రమ అరెస్టులు,నిర్బంధాలు, నోటీసులతో ఉద్యమాన్ని ఆపలేరని ప్రభుత్వం గుర్తెరగాలన్నారు.

కదిరి టౌన్ : యుటిఎఫ్ కమిటీ పిలుపుమేరకు ఉద్యోగుల బకాయిల సాధనకై 12 గంటల ధర్నాకు బయలుదేరి వెళ్తున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నూర్‌వలి, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు ఎం ఆజం భాష, తనకల్లు మండల ప్రధాన కార్యదర్శి ఖాజా మొహిద్దీన్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బుధవారం పట్టణ సిఐ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నివాసాల వద్దకు చేరుకొని ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఉద్యోగ ,ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ధర్నా కు వెళ్లకుండా పోలీసులు చేత అరెస్ట్ చేసి ఉద్యమాలను నిలువరించాలనుకోవడం సిగ్గుచేటని అన్నారు. తమ న్యాయపరమైన రాజ్యాంగబద్ధమైన హక్కులను సాధించేంతవరకు న్యాయపోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్డీవో కార్యాలయం ముట్టడి

పుట్టపర్తి రూరల్: సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో భాగ్యరేఖకు అందజేశారు. 15వ రోజు సమ్మెలో భాగంగా సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, రామన్న, , నాగరాజు, ఓబులేసు, రూపాదేవి, శ్రీలత, హేమావతి, అనిత, శ్రీనివాసులు, ఆనంద్, ప్రసాద్ రాజశేఖర్, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఎ జెఎసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా తమ ప్రధాన డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తున్నామని అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. డిమాండ్లు పరిష్కారం కోసం రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ పిలుపు మేరకు సమ్మెను ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..?

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అంటూ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 9వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా కార్మికుల సమ్మెకు నాగభూషణం మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షులు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపుఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షుడు అద్రామహేశ్, ప్రధాన కార్యదర్శి బొగ్గునాగరాజు, సహాయకార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు దాసరిసురేశ్, అంకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 9వ రోజుకు చేరుకుంది. బుధవారం నిరసన దీక్షా శిబిరానికి శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్మికులు సహకరించి యధావిధిగా విధులలో చేరాలని ఆయన కోరారు. కార్మికులు సమాధానమిస్తూ తమ సమస్యలు పరిష్కరిస్తే సమ్మె విరమించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యగౌడ్, సాయి గీత, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగార్జున, గోవిందు, నరసింహులు, రామయ్య, పెద్దన్న, సరోజమ్మ, నారాయణమ్మ, రామక్క, గంగమ్మ పాల్గొన్నారు.

హిందూపురం : సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు తమ ఉద్యోగాలను పర్మి నెంట్ చేయాలని డిమాండ్ చేస్తు మున్సిపల్ కాంట్రాక్టు, పారిశుధ్య కార్మికులు చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 9వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మల్లికార్జున, జగదీష్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పెనుకొండలో అక్రమ అరెస్టులు



పోలీసు వాహనానికి అడ్డంగా పడుకున్న కార్మికులు

పోలీసులతో నాయకుల వాగ్వాదం

వాహనానికి అడ్డంగా పడుకుని నిరసన

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె బుధవారానికి 9వ రోజు కు చేరుకుంది. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ కార్మికులను పనులలోకి రావాలని ఆదేశించారు. దీంతో కార్మికులు తమ సమస్యలను పరిష్కారం చేసే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి చేరుకొన్న పోలీసులు సిఐటియు, మున్సిపల్ కార్మికసంఘ నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో కార్మికులు అడ్డుకున్నారు. పోలీసు వాహనానికి అడ్డంగా పడుకున్నారు. దీంతో కొద్దిసేపు తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు సిఐటియు నాయకులు, కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి సిఐ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిపిఎం నాయకులు తిప్పన్న, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి గోరంట్ల

పట్టణంలో బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే శంకర్‌నారాయణ బుధవారం ప్రారంభించారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న స్థలంలో 45 రూములతో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, సర్పంచి సరోజ నాగే నాయక్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచి రాజారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి గుడి ఆవరణంలో చెత్త చెదారాన్ని తొలగించారు. ఎంఇఒ రమణప్ప, ఉపాధ్యాయులు కుళ్లాయప్ప, చంద్రశేఖర్, మదన్మోహన్, నాగేంద్ర, రమేష్ బాబు, సుంకన్న తదితరులు ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. పాల్గొని శ్రమదాన కార్యక్రమం చేసి గుడి ఆవరణాన్ని శుభ్రం చేశారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం

పుట్టపర్తి క్రైమ్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సత్యమ్మ గుడి సర్కిల్లో పెంచిన లబ్ధిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న, అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక సచివాలయం వద్ద వైఎస్ఆర్ పింఛను కానుక వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి ఇన్‌ఛార్జి దీపిక మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే జగన్ మోహన్ రెడ్డి ధ్యేయం అని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు మూడు వేల రూపాయలు పింఛను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి, ఎంపీడీవో నరసింహ నాయుడు, వైస్ ఎంపీపీ ఆంజనరెడ్డి, నీలావతి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, సర్పంచి ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఎంపీడీవో మునిస్వామి, ఎంపీపీ ఈరన్న చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, నాయకులు శ్రీనివాసరెడ్డి, త్రిలోక్‌నాథ్, సర్పంచి హితేంద్ర, ఎంపీటీసీలు హనుమంతరావు, నారాయణగౌడ, వీరకేతరయప్ప, రాజప్ప, ఇఒఆర్‌డి నాగముని, పంచాయతీ కార్యదర్శులు నరేష్ బాబు, వీరన్న, భాస్కర్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీలోని 10వ వార్డు సచివాలయంలో పింఛన్లు ఆవార్డు కౌన్సిలర్ కెఎస్ దిల్షాదున్నిసా, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు కెఎస్ బహవుద్దీన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అంతకు ముందు లబ్దిదారులతో కలసి సిఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ కృష్ణమూర్తి, ఎడ్యుకేషన్ సెక్రటరీ కార్తిక్ వైసిపి నాయకులు షనవాజ్, మస్తాన్ ఖాన్, రహంతుల్లా, మౌలా, దౌల, ఖలీల్, రహీం, గఫార్, జుబేదా, యస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అవసరం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని సిద్దయ్యగుట్టలోగల అతి పురాతన ఆలయమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధికి దాతలు ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఆలయ కమిటీ అధ్యక్షురాలు జయశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన స్వగృహంలో ఆలయ అభివృద్ధి కమిటీ సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. అందరూ సహకరిస్తే ఈ సంవత్సరం లోపు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వారు తెలిపారు. ఈసందర్భంగా పట్టణ ప్రముఖ నేత గడ్డం శ్రీనివాసులు ఐదు లక్షల విరాళాన్ని అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేందర్ రెడ్డి, కోశాధికారి కలవల మురళీధర్, ఉపాధ్యక్షులు పుట్లూరు నరసింహులు, శ్రీనివాసరెడ్డి, గడ్డం పార్థసారథి, జయప్రకాష్, అవినాష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగతదూషణలు చేస్తే సహించం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణపై వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేదిలేదని, భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని గోనుగుంట్ల అనుచరులు పరిటాల శ్రీరామ్ వర్గీయులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలోని గోనుగుంట్ల సూర్యనారాయణ వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. గోనుగుంట్ల సూర్యనారాయణపై పరిటాల శ్రీరామ్ వర్గీయులు చేసిన విమర్శలకు ఘాటుగా స్పందించారు. తమ నాయకుడు అన్ని వర్గాలకు అండగా ఉంటున్నారన్నారు. గోనుగుంట్లపై విమర్శలు మానుకోకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల అనుచరులు డిష్రరాజు, గొట్లూరుచంద్ర, చిగిచెర్ల అరవిం దరెడ్డి, తుంపర్తి పరమేష్, చిలకంసూర్యనారాయణరెడ్డి, దుస్సాక్రిష్ణ, పరితాల దస్తగిరి, బోడగలగిరిధర్, నారాయణస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు


బుక్కపట్నం పోలీసు స్టేషన్‌లో అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు


పెనుకొండ పోలీసుస్టేషన్‌లో ఉన్న అంగన్వాడీలు, సిఐటియు రమేష్


కదిరి పోలీసుస్టేషన్‌లో ఉన్న అంగన్వాడీలు

అడుగడుగునా అంగన్వాడీల నిర్బంధం

ప్రజాశక్తి - మడకశిర

తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన కలెక్టర్ ముట్టడికి వెళ్లకుండా అంగన్వాడీలను పోలీసులు నిర్బంధించారు. బుధవారం సత్యసాయి జిల్లా కలెక్టర్ ముట్టడికి వెళుతున్న మడకశిర నియోజకవర్గంలోని అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికి అక్కడ అడ్డగించారు. పలువురిని మడకశిర స్టేషన్లో నిర్బంధించారు. పట్టణంలో ఉదయం ఐదు గంటల నుండే పోలీసులు అన్ని బస్సులను తనిఖీ చేసి అంగన్వాడీలను అడ్డుకొని స్టేషన్కు తరలించారు. తమ సొంత వాహనాలు ఇతర వాహనాలలో వెళుతున్న అంగన్వాడీలను కూడా పోలీసులు ఎక్కడికి అక్కడ అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంగన్వాడీలకు స్టేషన్లో ఎలాంటి సౌకర్యం లేక ఎండలోనే కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పెనుకొండ : కలెక్టర్ ముట్టడికి వెళతారన్న ఉద్దేశ్యంతో పోలీసులు స్థానిక అంగన్వాడీలను బుధవారం తెల్లవారుజామున 3గంటలకు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై సిఐటియు రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బుక్కపట్నం : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ హెచ్చరించారు. బుధవారంకలెక్టర్ ముట్టడికి వెళుతున్న అంగన్వాడీలను, సిఐటియు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం దుర్మార్గమని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తుందని అలా చేస్తే అంగన్వాడీలు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సిపిఎం నాయకులు బ్యాల అంజి అంజి, నాగమణి, జ్యోతి తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు.

లేపాక్షి : కలెక్టరేట్ ముట్డడికి వెళుతున్న స్థానిక అంగన్వాడీలను లేపాక్షి పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులను, అంగన్వాడీలను అరెస్టు చేశారు. పోలీసుల తీరుపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కదిరి అర్బన్ : కలెక్టరేట్ ముట్టడికి వెళుతున్న అంగన్వాడీలను, సిఐటియు నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు నరసింహులు బాబ్జాన్ జగన్మోహన్ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మాబున్నీసా మాట్లాడుతూ కనికరము లేని రాష్ట్ర ప్రభుత్వానికి తగిన రీతిలో తగిన సమయంలో గుణపాఠం నేర్పుతామని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముదిగుబ్బ : కలెక్టరేట్ ముట్టడికి వెళుతున్న అంగన్వాడీలను పోలీసులు అరెస్గు చేశారు. ఈసందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు.

పుట్టపర్తి అర్బన్ : అంగన్వాడీలు కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముందస్తు అరెస్టులు కొనసాగించారు. అంగన్‌వాడీ యూనియన్, సిఐటియు నాయకులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం తెల్లవారుజామునే సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్‌ను అరెస్టు చేసి నల్లమాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ జిల్లా వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణను పుట్టపర్తికి రాకుండా అమడగూరులో నిర్బంధంలోకి తీసుకున్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్‌ను తెల్లవారుజామునే అదుపులోకి తీసుకుని పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో ఉంచారు. పలువురు అంగనవాడి యూనియన్ నాయకురాళ్లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ అరెస్టులను సిఐటియు ఉపాధ్యక్షులు ఎం.ఇంతియాజ్, శ్రామిక మహిళా సమాఖ్య కార్యదర్శి దిల్షాద్‌బి, అంగన్వాడీల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి తదితరులు ఖండించారు.

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు


పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని జిల్లడగుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే భూతన్న ఆధ్వర్యంలోసావిత్రిబాయి పూలే జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయినిలు సుధారాణి, సునీత, ఇందిరమ్మ, లలితమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరియన్న, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూర్యపాఠశాల హెచ్‌ఎం నరేంద్రబాబు సూచించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక సూర్యపాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, సుగుణ, సుమియా, హేమలత, సునీత, మారుతి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక బిఆర్.అంబేద్కర్ కూడలిలో మండల దళిత నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణప్ప, తిప్పేస్వామి, జయకుమార్, ప్రసాద్, చెన్నప్ప, త్రిలోక్, నవీన్, నరసింహామూర్తి, మంజునాథ్, ముద్దరాజు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : బాలికల విద్యను సావిత్రిబాయి పూలే ఎంతో ప్రోత్సహించారని ఆమె చేసిన సేవలు మరువలేనివని మాల మహానాడు నాయకుడు రామాంజనేయులు, చెనరాయుడు, ప్రభాకర్ ,తెలిపారు ఎస్సీ కాలనీలోనే ఆర్ డి టి పాఠశాల నందు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపి, ఆంజనేయులు, మునిలక్ష్మి, నాగలక్ష్మి ,జయలక్ష్మి ,శ్రావణి, నాగరాజు ,తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులతో పాటు కళాశాల అధ్యాపకులు పావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబావలి, కళాశాల ప్రిన్సిపాల్ తిలక్, ఎస్ఎఫ్ఐ నాయకులు గురు, మంజునాథ్, ఇంతియాజ్, నిహాల్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా బిఎస్‌పి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆబాద్‌పేటలోని బిఎస్‌పి కార్యలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు శ్రీరాములు, దాసరి ఈశ్వరయ్య, నాజీమ్ భాష, హరికుమార్, క్రిష్ణప్ప, బండారు లక్ష్మీనారాయణ, గంగాధర్, ప్రకాష్, యోగానంద్, నారాయణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం కోసం ప్రత్యేకంగా మేనిఫెస్టో : పరిటాల

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్ఫూర్తితో ధర్మవరం పట్టణం కోసం ప్రత్యేకంగా ఒక మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలో ఐదు రోజుల పాటు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శివానగర్లోని శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజల అనంతరం 7వ వార్డులో పాదయాత్రను ప్రారంభించారు. స్థానిక నాయకులతో కలిసి బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ప్రతి కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలు తెలుసుకున్న తర్వాత ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేస్తామన్నారు. ఈ పాదయాత్ర 8వతేదీవరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శులు గోనుగుంట్లవిజయ్‌కుమార్, కమతం కాటమయ్య, పణికుమార్, పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, అత్తర్ రహీంబాషా, గోసలశ్రీరాములు, బొట్టుకిష్ట, మహేష్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.


మినీ మేనిఫెస్టో కరపత్రాలను చూపుతున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

ఓటరు జాబితా తయారీపై అఖిలపక్ష సమావేశం


సమావేశంలో సబ్‌కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలో ఓటర్స్ కరెక్షన్స్ (ఆడిషన్స్ డిలేషన్) సంబంధించి అఖిల పార్టీ సమావేశాన్ని తహశీల్దార్ హసీనా సుల్తాన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ ఓటరు జాబితా తప్పులు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మనోహర్, హిందూపురం పార్లమెంటరీ మైనారిటీ సెల్ అధ్యక్షులు భక్తర్, డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణమూర్తి కొంకల్లు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, విశ్రాంతి ఇంజనీర్ మల్లికార్జున, సిపిఐ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు తాఖీదు : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ రావు హాజరు కాలేదు. దీంతో సబ్‌కలెక్టర్ కమిషనర్‌కు జారీ చేశారు . సమావేశానికి హాజరైన మేనేజర్‌ను సమావేశం నుండి బయటకు పంపించేశారు.

పుట్టపర్తి రూరల్ : ఎలక్ట్రాన్ ఓటింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాజకీయ పార్టీ నాయకులు అధికారులతో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఓటర్లుకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటింగ్ ఎలా చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి విజయ్ భాస్కర్ రెడ్డి, బాలగంగాధర్, సి.పి.యం. పైపల్లి గంగాధర్, టిడిపి మాల మనోహర్, బేకరీ వెంకట నాయుడు, జనసేన బొగ్గరం శ్రీనివాసులు, అబ్దుల్ ఖాదర్,డాక్టర్ తిరుపతేంద్ర ,పెద్దన్నతో పాటు తహశీల్దార్లు కరుణాకర్, దేవేంద్రనాయక్, పుట్టపర్తి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పలు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ సమావేశం నిర్వహించారు. ఓటరుజాబితా తయారీలో ఏవైనా లోటుపాట్లు ఉంటే తెలపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమం ఎఒ రమణ, పెనుకొండ అసెంబ్లీ ఎఇఆర్‌ఒలు, అసెంబ్లీ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బి .హనుమంతు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ షాషావలి, సి. గణేష్ కుమార్, రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు .

శ్రీధర్ రెడ్డికి టికెట్ కేటాయిస్తే రాజకీయాలకు దూరం లోచర్ల విజయభాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి వైసిపి అసెంబ్లీ టికెట్‌ను దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి టికెట్ కేటాయిస్తే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత శాసనసభ ఎన్నికలలో పుట్టపర్తి నియోజకవర్గంలో వైసిపి విజయం సాధించడం అసాధ్యమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి రాజకీయాలను కార్పొరేట్ స్థాయిలో నడిపాడని ఆయన ప్రవర్తన మూలంగా నియోజకవర్గంలోని వైసిపి నాయకులు రాజకీయాలకు దూరమవుతున్నారని అన్నారు. దిగువ స్థాయిలో ఏమి జరుగుతుందో అధిష్టానం తెలుసుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలని ఆయన కోరారు. ప్రస్తుతం స్థానిక వైసిపి నాయకులు ప్రాణం లేని బొమ్మల్లా తిరుగుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గం వైసిపి టికెట్ శ్రీధర్ రెడ్డికి ఇస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ధర్మవరం టౌన్ : దాతల సహాయ సహకారంతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమవుతుందని బిఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే బిఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి ఫలితాలలో మంచి గుర్తింపు పొందిందన్నారు. ఈనేపథ్యంలో దాశెట్టి సుబ్రహ్మణ్యం వారి కుటుంబ సభ్యులు పాఠశాల విద్యార్థుల అవసరార్థం రూ.1 . 50 లక్షల వ్యయంతో షెడ్డును నిర్మించారన్నారు. దీంతో దాతలను బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యుగంధర్, దాశెట్టి నాగరాజు, దాశెట్టి శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రకాష్, లక్ష్మీనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


దాతను సన్మానిస్తున్న దృశ్యం

రెండు దుకాణాల్లో చోరీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రియాంక నగర్ ప్రధాన రహదారి పక్కనున్న రెండు దుకాణాల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని ప్రియాంకనగర్ ప్రధాన రహదారి పక్కనున్న రేకుల దుకాణాల్లోని శ్రీలక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజస్ దుకాణం రేకులను తొలగించి రూ.60వేలు నగదు. రూ.1.50లక్షలు విలువ చేసే విద్యుత్ వైర్లు, రూ.50వేలకుపైగా విలువ చేసే ఫ్యాన్లు, గీజర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. అనంతరం పక్కనే ఉన్న మొబైల్ షాపు రేకులు తొలగించి రూ. 40వేలు విలువ జేసే కంప్యూటర్, నాలుగు మొబైల్ ఫోన్లు ఇతర సామాగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం కాలువేపల్లి గ్రామంలో లక్ష్మీ రంగనాథ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన కళ్యాణ మండపం నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. హళ్లి గ్రామానికి చెందిన విశ్రాంత విద్యాశాఖ డైరెక్టర్ అనసూయమ్మ తిమ్మప్ప తమ వంతుగా 25 వేల రూపాయలు విరాళం అందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు కాంతరాజు, రాజన్న, తిమ్మప్ప, శ్రీరంగప్ప, బండి రమేష్ తెలిపారు.

ఓటు హక్కు వినియోగం పై నిరంతర అవగాహన

ధర్మవరం టౌన్ : రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి ఆర్డీవో కార్యాలయంలో గత పది రోజులుగా ఈవీఎం మిషన్ పై ఓటును వేసే విధానంపై అవగాహన సదస్సును ప్రతిరోజు నిర్వహిస్తున్నామని ఇది నిరంతర పక్రియగా కొనసాగుతుందని ఆర్డీవో సురేష్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే పలు డిగ్రీ కాలేజీలకు వెళ్లి ఇవిఎం యంత్రంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి కతిజున్ కుప్రా, సిఎస్‌డిటి ఈశ్వరయ్య, సిబ్బంది రాజకుమార్, రాజ్యలక్ష్మి, లక్ష్మీదేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్ష

హిందూపురం : పట్టణంలో 1వ వార్డు కోట్నూరులో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ ఇంద్రజ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంద్రజ మాట్లాడుతు పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించిన మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి దక్కితే ప్రతి పేదవాడి ముంగిటికే వైద్యాన్ని చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు జయప్ప, గిరి, రోషన్ ఆలి, ఎ బ్లాక్ కన్వీనర్ వాల్మీకి నరేష్, వైసిపి నాయకులు, మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా బుధవారం రేగాటిపల్లి సర్పంచ్ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీతారాంపల్లి, ముచ్చురాంపల్లి ,రేగాటిపల్లి గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రేగాటిపల్లి గ్రామపంచాయతీలో దాదాపు రూ. 45 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యోగేశ్వరి దేవి, ఏపీవో అనిల్ కుమార్ రెడ్డి, శంకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ మధుసూదన్, రేగాటిపల్లి సర్పంచి సురేష్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, విశ్వనాథరెడ్డి, నారపరెడ్డి, గంగాధర్ తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


బైక్‌ర్యాలీలో ఎమ్మెల్యే, తదితరులు

వైసిపి పాలనపై తీవ్ర వ్యతిరేకత : కందికుంట

కదిరి టౌన్ : రాష్ట్రంలో జగన్ పాలన పై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత నెలకొందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని కందికుంట నివాసంలో తలుపుల మండలంలోని పలువురు వైసిపి నాయకులు టిడిఇపలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శంకర్ ఆధ్వర్యంలో ఈదుల కుంట్ల పల్లి పంచాయతీ వైసిపికి చెందిన సర్పంచ్ కుమారి భాయ్‌తో పాటు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు దాదాపు 200 మంది వైసిపిని వీడి కంది కుంట సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ మేరకు కందికుంట వారికి టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ జగన్ అనాలోచిత విధానాలతో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్